మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 2-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 273 Issue: 273

Published from Jagitial
Circulated to Telangana

02 ఏప్రిల్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి పౌర్ణమి ఉ. 7:42 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం హస్త సా. 5:36 వరకు తరువాత చిత్తా యోగం ధ్రువ మ. 2:17 వరకు కరణం బవ ఉ. 7:42 వరకు భాలవ రా. 8:12 వరకు వర్జ్యం రా. 2:13 నుండి తె. 3:56 వరకు దుర్ముహూర్తం ఉ. 10:17 నుండి ఉ. 11:06 వరకు మ. 3:10 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:51 నుండి మ. 3:22 వరకు యమగండం ఉ. 6:13 నుండి ఉ. 7:45 వరకు గుళికాకాలం ఉ. 9:16 నుండి ఉ. 10:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 11:18 నుండి మ. 12:59 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:44 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# అంజన్న భద్రత.. గాలికి!

అసలే కొండగట్టు అంజన్న అంటే చిన్నచూపు..
రూ.కోట్ల విరాళాలు వస్తున్నా వసతులు మాత్రం అరకొరే..
మామూలుగానే గుడి చుట్టు పరిసరాలూ పరిశుభ్రంగా ఉండవు..
దేవుడి దగ్గర లొల్లి ఎందుకు అని సర్దుకుపోతారు భక్తులు..
కానీ, పర్వదినాల్లోనూ అధికారులకు పట్టింపు లేకపోతే ఎలా?
భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయకపోతే ఎలా?
గాలి దుమారానికే చలువ పందిళ్లు కూలిపోతే ఎలా?
భక్తులు అధిక సంఖ్యలో ఉండే టైంలో ఇలా జరిగి ఉంటే..?
తొక్కిసలాట జరిగి ఉంటే..? ఆ ఊహే భయం పుట్టిస్తోంది!!
ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు..
అంజన్నపై దయ పుట్టేదెప్పుడు?
భక్తులకు పాట్లు తప్పేదెప్పుడు?

## కొండగట్టులో గాలి దుమారానికి కూలిన చలువ పందిళ్లు

## పలువురికి గాయాలు.. భయంతో వణికిన అంజన్న భక్తులు

## తాత్కాలిక హంగులతో భక్తుల ప్రాణాలతో చెలగాటం

## ఆదాయం కోట్లలో.. అభివృద్ధి మాత్రం కూలిపోయేలా!

## లైటింగ్‌తో మెరిపిస్తే సరిపోతుందా? వసతులు వద్దా?

## అధికారులకు పట్టని వాతావరణ శాఖ హెచ్చరికలు!?



మల్యాల/ జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు అంజన్న ఆలయం వద్ద విషాదం చోటుచేసుకుంది. హనుమాన్ విజయోత్సవ వేడుకల వేళ స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఊహించని ప్రమాదం ఎదురైంది. ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కుప్పకూలడంతో, వాటి కింద ఉన్న సుమారు 10 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే తోటి భక్తులు, స్థానికులు స్పందించి పందిళ్ల చిక్కుకున్న వారిని బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఇంతటి ముఖ్యమైన పండగ సమయంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై భక్తులు తీవ్ర స్థాయిలో -2 వ పేజీలో...

# ఖజానాకు మద్యం కిక్

## 40 వేల కోట్లకు ఎక్సైజ్ ఆదాయం.. ఏడేళ్లలో రెట్టింపు

రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ ఆదాయం 2025-26లో రూ.40,209 కోట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలిసారిగా రూ.40 వేల కోట్ల ఆదాయానికి చేరుకోవడం ఇదే తొలిసారి. 2018-19 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్‌శాఖకు రూ.20,859 కోట్ల ఆదాయం వచ్చింది.



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ఈ ఆదాయం ఏడు సంవత్సరాల్లో 2025'26 నాటికి రూ. 40.209 కోట్లకు చేరుకుంది. 2024-25 అర్థిక సంవత్సరంలో రూ.37,487 కోట్ల ఆదాయం మద్యం అమ్మకాల ద్వారా రాగా, 2025-26లో గత సంవత్సరంతో పోలిస్తే రూ.2722 కోట్ల మద్యం అమ్మకాలు అదనంగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి 7 శాతంగా మద్యం అమ్మకాలు పెరిగాయి. 2025-26 అర్థిక సంవత్సరంలో 382.91 లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. 2025-26 అర్థిక సంవత్సరంలో 2 శాతం లిక్కర్ సెల్స్ తరువాయి 2 వ పేజీలో...

# మీసేవల్లో ధరల హైక్

## ఎరిగిన చార్జీలు... నిన్నటి నుంచే అమల్లోకి..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, బిల్లు చెల్లింపుల కోసం వసూలు చేసే యూజర్ చార్జీలను ప్రభుత్వం భారీగా పెంచింది. ఈ మేరకు ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కనిష్టంగా రూ.35 ఉన్న సర్వీస్ చార్జీని ఇప్పుడు ఏకంగా రూ. 62కు పెంచారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): తాజా పెంపు ప్రకారం.. తక్షణమే లభించే ఏ-కేటగిరీ సర్టిఫికెట్ ప్రింట్ వంటి సేవలకు రూ.62 వసూలు చేయనుండగా.. ఇన్‌కం, క్యాస్ట్, నివాస ధృవీకరణ పత్రాల వంటి బీ-కేటగిరీ సేవలకు రూ. 80గా ధరను నిర్ణయించారు. వీటితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఆర్టీఏ సేవలు, ఇతర ప్రభుత్వ అప్లికేషన్లపై కూడా అదనపు భారం పడనుంది. ఇన్‌కం సర్టిఫికెట్‌కు గతంలో రూ.45 నుంచి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,295 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,874 |



# భూభారతి నేడే ప్రారంభం

## 5 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు.. మంత్రి పొంగులేటి వెల్లడి

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో రెవెన్యూ శాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకమైన, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ 'ఇంటిగ్రేటెడ్ భూ భారతి' పోర్టల్‌ను రూపొందించామన్నారు.


హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ఈ పోర్టల్‌ను గురువారం నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి ఇది తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు, చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాసరెడ్డి, బుధవారం పోర్టల్ ప్రారంభానికి సంబంధించి తరువాయి 2 వ పేజీలో...



2

## యూపీఐ ట్రాన్సాక్షన్స్ ఆల్‌టైం హై

## విశ్వవాణి



ఎలక్ట్రాన్ల సాధారణ జీవిత కాలమే 66,000 యోటా ఇయర్స్. అంటే 66 బిలియన్ ట్రిలియన్ ట్రిలియన్ (66 లక్షల కోట్ల కోట్ల కోట్ల సంవత్సరాలు) సంవత్సరాలు.

# ఒకే రాష్ట్రం ఒకే యూనిఫాం

## 21 వస్తువులతో స్పెషల్ కిట్.. పాఠశాల విద్యార్థులకు గుడ్ న్యూస్

## కొత్త విద్యా సంవత్సరం నుంచి అమలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు స్పెషల్ కిట్‌ను అదించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ మాత్రమే ఇస్తూ వస్తున్న సర్కార్ ఈసారి నుంచి ఏకంగా 21 రకాల వస్తువులతో కూడిన స్పెషల్ స్కూల్ కిట్‌ను విద్యార్థులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): అంతేకాదు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావా లని నిర్ణయించింది. అంతే కాకుండా, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా రాబోయే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో కొత్త తరువాయి 2 వ పేజీలో...





# రాశి ఫలాలు

2.4.2026

మేషం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. సంతాన విద్యా విషయాలు నిరాశ కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. తల్లి తరపు బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. వాహన ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సోదరుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. వాహన యోగం ఉన్నది.

మిధునం: వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయం తీసుకోలేరు. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. కొన్ని విషయాలలో మానసికంగా ఆలోచనలు ఇబ్బందికి గురిచేస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. నూతన ఋణయత్నాలు చెయ్యకపోవడం మంచిది.

కర్కాటకం: కుటుంబ విషయంలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్ధిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలలో మీ కష్టానికి తగిన గుర్తింపు లభించదు. ఆర్ధిక వ్యవహారాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబమున కొంతమంది ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కన్య: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరమైన చిక్కులు నుండి ఉపశమనం కలుగుతుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభించిన విజయం సాధిస్తారు. వృత్తి,ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు ఉన్న నిదానంగా పూర్తిచేస్తారు. వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

తుల: చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్థిక పరమైన ఇబ్బందులను అధిగమించి పాత ఋణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి.

వృశ్చికం: సంతాన విద్యా విషయాలకు సంభందించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబ సభ్యులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సౌకర్యాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందుతాయి.

ధనస్సు: శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో మీ కష్టం వృధాగా మిగులుతుంది.

మకరం: ధన పరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. గృహమునకు బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలున్నవి. వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు.

కుంభం: చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలను తీసుకోవడం మంచిది. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది.

మీనం: ఆర్ధిక విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రారంభించిన పనులు కొంత నిదానంగా పూర్తి చేస్తారు. సహోద్యోగుల ప్రవర్తన వలన శిరో బాధలు పెరుగుతాయి. వాహన ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.



# అంజన్న భద్రత..'గాలికి'!

**మొదటి పేజీ తరువాయి**

మండిపడుతున్నారు. హనుమాన్ విజయోత్సవ(చిన్న జయంతి) వేడుకల్లో భాగంగా భారీగా తరలివచ్చే మాలధారుల కోసం ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. అయితే, వేడుకల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నాణ్యత లేని పనితనం స్పష్టంగా కనిపిస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలహీనంగా ఉన్న స్తంభాలు, సరిగ్గా బిగించని పందిళ్ల వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. గతంలో కొండగట్టు ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాలు భక్తులను భయభ్రాంతులకు గురిచేయగా, ఇప్పుడు ఆలయ ఆవరణలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.



### అంజన్న భక్తులపై ఇంత నిర్లక్ష్యమా?

గాలివాన తాకిడికి భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు కుప్పకూలడం, పలువురు గాయపడటం అధికారుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం. ఏటా లక్షల మంది భక్తులు తరలివచ్చే ఇలాంటి వేడుకల సమయంలో కనీస నాణ్యత లేని ఏర్పాట్లు చేయడం అమానుషం అని భక్తులు మండిపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోలేని 'తాత్కాలిక' హంగులతో భక్తుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టు అభివృద్ధికి వందల కోట్లు కేటాయిస్తున్నామని ప్రభుత్వం ఘనంగా ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం 'తీగె తెగని' చందంగానే ఉందని విమర్శిస్తున్నారు. కేటాయింపులు కాగితాలకే పరిమితమవుతున్నాయా? లేక పనుల్లో నాణ్యత లోపిస్తోందా? అని నిలదీస్తున్నారు. భక్తులు గంటల తరబడి వేచి ఉండే క్యూలైన్ల వద్ద గానీ, విశ్రాంతి తీసుకునే ప్రదేశాల్లో గానీ శాశ్వత మౌలిక వసతులు కల్పించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, చలువ పందిళ్లు గాలికి ఊగిపోతున్నాయంటే, అవి ఎంత నాసిరకంగా నిర్మించారో అర్థం చేసుకోవచ్చని ధ్వజమెత్తారు. అసలే అరకొర వసతులతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు ప్రాణాపాయ స్థితి తలెత్తడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోందని, ప్రభుత్వం కేవలం నిధుల ప్రకటనలతో సరిపెట్టుకోకుండా, అభివృద్ధి పనుల నాణ్యతపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

### లైటింగ్‌తో మెరిపిస్తే చాలా?

ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తే భక్తుల కష్టాలు తీరిపోతాయా? కేవలం లైటింగ్‌తో మెరిపిస్తే పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందినట్లు అవుతుందా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అలంకరణల కోసం ఖర్చు చేసే శ్రద్ధలో పదో వంతు.. పందిళ్ల నాణ్యతపై పెట్టి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉత్సవాల అలంకరణలకే పరిమితం కాకుండా.. శాశ్వత క్యూలైన్లు, పరిశుభ్రమైన కోనేరు, నాణ్యమైన తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

### వాతావరణ హెచ్చరికలను లైట్ తీసుకున్నారా?

కొండగట్టు ఆలయ అభివృద్ధికి వందల కోట్లు కేటాయించామని చెప్తున్న పాలకులు, కనీసం వర్షానికి తడవని, గాలికి పడిపోని ఒక గట్టి పందిరిని కూడా వేయించలేకపోవడం సిగ్గుచేటు. అధికారులు కేవలం ఉత్సవాల పేరుతో హడావుడి చేయడం, నాసిరకం పనులకు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. తాత్కాలిక ఏర్పాటుల పేరిట భక్తులను మృత్యుపాశాల కింద కూర్చోబెడతారా? పందిళ్లు వేసేటప్పుడు కనీస భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అని తనిఖీ చేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా? ప్రభుత్వ ప్రకటనలు పత్రికలకే పరిమితమై, కొండగట్టుపై భక్తుల కష్టాలు మాత్రం నిత్యకృత్యమయ్యాయి. వాస్తవానికి తెలంగాణలో పలు ప్రాంతాల్లో గాలి దుమారం, వర్షం పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తూనే ఉంది. ఆ హెచ్చరికలను బట్టైనా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సింది. కానీ, అసలు ఆ దిశగా ఆలోచించినట్లే లేదు.

### ఆలయం చుట్టూ అపరిశుభ్రతే

సాధారణ సమయాల్లో కొండగట్టుకు వెళ్తే ఆలయం చుట్టూ ఉన్న పరిసరాలు ప్రశాంతతే పోగొట్టేలా ఉంటాయంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పవిత్ర స్నానాలు ఆచరించే కోనేరు నీరు కలుషితంగా ఉంటుంది. నీరు రంగు మారి, దుర్వాసన వెదజల్లుతుంది. నీటిలో నాచు, చెత్తాచెదారం పేరుకుపోతుంది. ఆ నీళ్లను భక్తులు స్నానం చేయడానికి జంకుతారు. గుడికి వచ్చి మురికిని పట్టించుకోవద్దు అంటూ కొందరు భక్తులు స్నానాలను మమ అనిపించేస్తారు. సరే పోనీ.. ప్రత్యేక సమయాల్లో, పర్వదినాల్లోనైనా వసతులు బాగుంటున్నాయా? అంటే.. చలువ పందిళ్లే సాక్ష్యం. ఆదాయం పరంగా కోట్లలో ఉన్నా, అభివృద్ధి పరంగా మాత్రం వెనుకబడి ఉంది. నిధుల ప్రకటనలు, మాస్టర్ ప్లాన్ల హడావుడి తప్ప, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

# జడ్జికే కుచ్చుటోపీ

## నకిలీ యాప్‌తో బురిడీ.. రూ.93 వేలు దోపిడీ

ముంబై: సైబర్ నేరగాళ్ల చేతిలో మరో న్యాయమూర్తి మోసపోయారు. నకిలీ యాప్ డోన్‌లోడ్ చేయడం వల్ల రూ.93,000 పోగొట్టుకున్నారు. ఆ జడ్జి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. మార్చి 30న ముంబై సిటీ కోర్టు జడ్జి తన ఫోన్ స్క్రీన్‌లో సమస్యను గమనించారు. ఆన్‌లైన్‌లో వెతికిన కస్టమర్ కేర్ సర్వీస్ నంబర్‌ను ఆయన సంప్రదించారు. కాగా, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించిన ఒక వ్యక్తి, 46 ఏళ్ల ఆ న్యాయమూర్తిని మోసగించాడు. ఆయనకు వాట్సాప్ ద్వారా ఒక ఏపీకే ఫైల్ పంపాడు. దానిని డౌన్‌లోడ్ చేసుకోమని సూచించాడు. రిజిస్ట్రేషన్ కోసం గూగుల్ పే ద్వారా రూ.20 రుసుము చెల్లించాలని సూచించాడు. మరోవైపు ఆ జడ్జి గూగుల్ పే ద్వారా రూ.20 చెల్లించారు. దీంతో సైబర్ మోసగాడు ఆయన మొబైల్ పరికరం, బ్యాంకింగ్ సమాచారాన్ని రిమోట్ యాక్సెస్ చేశాడు. ఆ వెంటనే జడ్జికి చెందిన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నుంచి రూ. 93,000 విలువైన రెండు అనధికార లావాదేవీలు జరిగాయి. కాగా, మనీ విత్ డ్రా మెసేజ్‌లు చూసిన ఆ న్యాయమూర్తి తాను మోసపోయినట్లు తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు తనను లక్ష్యంగా చేసుకున్నారని గ్రహించి పోలీసులను ఫిర్యాదు చేశారు. దీంతో ముంబైలోని టార్డియో పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ సైబర్ మోసంపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే అదే రోజైన మార్చి 30న మరో సైబర్ మోసం కేసులో బాంబే హైకోర్టు న్యాయమూర్తిని రూ. 6.02 లక్షలకు మోసం చేసిన 25 ఏళ్ల నిందితుడిని పోలీసులు జార్ఖండ్‌లో అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాలలో సుమారు 36 సైబర్ మోసాల కేసులతో ఆ నిందితుడికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# మార్చిలో రూ.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సరికొత్త మైలురాయిని అందుకున్నాయి. 2026 మార్చి నెలలో జీఎస్టీ ఆదాయం తొలిసారిగా రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటింది. బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం మార్చిలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 2,00,064 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో వసూలైన రూ. 1,83,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం అధికం. దేశీయంగా స్థిరమైన ఆదాయంతో పాటు దిగుమతులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ. 1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే 8.2 శాతం ఎక్కువ. మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ. 22.27 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఇవి రూ. 20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 7 శాతం జీడీపీ వృద్ధితో ముందుకు సాగుతున్న తరుణంలో జీఎస్టీ వసూళ్లు కూడా అదే స్థాయిలో పెరగడం శుభపరిణామమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న వినియోగం, దిగుమతులు, మెరుగైన పన్నుల చెల్లింపుల వ్యవస్థ దీనికి కారణమని వారు అభిప్రాయపడ్డారు. గత 12 నెలలుగా జీఎస్టీ వసూళ్లు వరుసగా రూ. 1.7 లక్షల కోట్ల కంటే పైనే నమోదు కావడం గమనార్హం.

# యూపీఐ ట్రాన్సాక్షన్స్ ఆల్‌టైం హై

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపులు కొత్త రికార్డులను నెలకొల్పుతున్నాయి. తాజాగా మార్చి నెలకు సంబంధించి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులు ఏకంగా 10 శాతం పెరిగాయి. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) బుధవారం గణాంకాలను వెల్లడించింది. దీని ప్రకారం, మార్చి నెలలో మొత్తం యూపీఐ లావాదేవీలు రూ. 29.52 లక్షల కోట్లకు చేరగా, ఇది ఫిబ్రవరిలో జరిగిన రూ. 26.84 లక్షల కోట్ల కంటే 10 శాతం ఎక్కువ. ముఖ్యంగా డిమాండ్ పెరుగుదలతో పాటు అంతకుముందు ఫిబ్రవరిలో తక్కువ రోజుల కారణంగా వృద్ధి అత్యధికంగా నమోదైంది. విలువ పరంగానే కాకుండా సంఖ్యా పరంగా కూడా యూపీఐ లావాదేవీలు 11 శాతం పెరిగి 2,039 కోట్ల నుంచి 2,264 కోట్లకు చేరుకున్నాయి. 2016, ఏప్రిల్‌లో యూపీఐ వ్యవస్థ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి నమోదైన అత్యధిక లావాదేవీల సంఖ్య, విలువ ఇవే కావడం విశేషం. ఇక, మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లావాదేవీల విలువ 21 శాతం మేర పెరిగి, రూ. 314.23 లక్షల కోట్లకు చేరుకుంది. అదేవిధంగా, లావాదేవీల సంఖ్య కూడా 30 శాతం వృద్ధి చెంది, 24,161.6 కోట్లకు పెరిగాయి.

# ఒకే రాష్ట్రం ఒకే యూనిఫాం

**మొదటి పేజీ తరువాయి**

నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరిలో సమానత్వ భావం పెంపొందించే విధంగా ప్రభుత్వం 'ఒకే రాష్ట్రం - ఒకే యూనిఫామ్' విధానాన్ని అమలు చేయనుంది. గతంలో పాఠశాలల రకాలను బట్టి వేర్వేరు రంగుల యూనిఫాంలు ఉండగా, ఇకపై అన్ని స్కూళ్లలో ఒకే రంగు, ఒకే డిజైన్‌తో కూడిన యూనిఫామ్ అమలు చేయాలని నిర్ణయించారు. ఇది విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు ఓ బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువస్తుందని విద్యాశాఖ విశ్వసిస్తోంది. ఇదిలా ఉండగా విద్యార్థులకు మరో కానుక అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. చదువుకు కావాల్సిన సామాగ్రి కోసం పిల్లలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 21 వస్తువులతో కూడిన భారీ స్కూల్ కిట్‌ను అందించడానికి సిద్ధపడింది. ఆ కిట్‌లో మూడు జతల యూనిఫామ్ క్లాత్, షూస్, రెండు జతల సాక్స్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, టై, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్ప్‌నర్, జామెట్రీ బాక్స్, డిక్షనరీ వంటి నిత్యావసర వస్తువులు ఉంటాయి. కాగా ఇవ్వన్నీ కూడా పాఠశాలలు పున:ప్రారంభమయ్యే నాటికే విద్యార్థులందరికీ అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశాలు జారీ చేశారు. కాగా ప్రభుత్వ నిర్ణయం వల్ల 26 లక్షల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

## ఖజానాకు మద్యం కిక్

**మొదటి పేజీ తరువాయి**

పెరుగగా, బీరు అమ్మకాలు 9 శాతంగా తగ్గాయి. 2024-25 అర్థిక సంవత్సరంలో 372.25 లక్షల కేసుల లిక్కర్, 536.13 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే బీరు అమ్మకాలు తగ్గాయి, లిక్కర్ అమ్మకాలు కొద్దిపాటిగా పెరిగాయి. ఎక్సైజ్‌శాఖకు 2620 ఏ - 4 మద్యం షాపుల ద్వారా సంవత్సరానికి రెంటల్ ఫీజ్ ద్వారా రూ. 1771 కోట్ల ఆదాయం సమకూరింది. 1214 బార్ల ద్వారా రూ. 549 కోట్ల ఆదాయం వస్తుంది. 2025-26 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖకు 95,628 దరఖాస్తుల ద్వారా రూ. 2869 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది.

## మీసేవల్లో ధరల హైక్

**మొదటి పేజీ తరువాయి**

రూ.55 ఉండగా.. తాజా సవరణల ప్రకారం రూ.80కి చేరింది. కుల ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి 55 ఉంగా.. ఇప్పుడు రూ.80కి చేరింది. స్థానికత ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. ప్రస్తుతం రూ.80కి పెంచారు. అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ గతంలో రూ.40 నుంచి 45 ఉండగా.. తాజాగా రూ.62కు పెంచారు. దీంతో సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు అప్లయ్ చేసుకునే సమయంలో విద్యార్థులు క్యాస్ట్, ఇన్‌కం, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా ఈ మూడింటి ధరలను ఏకంగా 80 రూపాయలకు పెంచడం వల్ల మధ్యతరగతి, పేద వర్గాల విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది.

# భూభారతి నేడే ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి**



రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని, సామాన్య రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచి ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ-సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా, ఇంటి నుంచే భూ సేవలు పొందే విధంగా పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి నుంచే 'భూ భారతి' పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చన్నారు. రైతు లాగిన్ అయిన వెంటనే తనకున్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే, అందుకు సంబంధించిన ఫీజు ఎంత చెల్లించాలో చూపిస్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళ్తాయి. ఆ తర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమే కాకుండా, సర్వేను రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక, అది మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళ్తుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారైన రైతుకు ఎల్‌పీఎం, భూధార్ నంబర్లు కేటాయిస్తారు. ఈ వివరాలన్నీ భూ భారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ అలర్ట్స్ వస్తాయని మంత్రి వివరించారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్‌కు (ఎల్‌పీఎం) యూనిక్ నంబర్, ప్రతి సర్వే నంబరుకు భూధార్ నంబరు కూడా ఇస్తామన్నారు. సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామని, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామన్నారు. దీనివల్ల సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి కావడమే కాకుండా, కచ్చితమైన వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ఒక కీలకమైన ముందడుగు అని మంత్రి స్పష్టం చేశారు.

# పెద్ద బూచోడు.. ఆటిజం!

**గోరు ముద్దలు పోయి సెల్‌ఫోన్ ముద్దలు వచ్చే.. పిల్లలు తినాలంటే చేతిలో ఫోన్ పెట్టాల్సిందే**



**ఫలితంగా పిల్లల్లో పెరిగిపోతున్న ఆటిజం**

(ఏప్రిల్ 2 - ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం)



ఒకప్పుడు తల్లులు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారు. పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడుతూ, నవ్వుతూ, ఆడుకుంటూ ఆరోగ్యంగా పెరిగేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చిన్నారుల చేతిలో సెల్‌ఫోన్, ట్యాబ్‌లు పెట్టి భోజనం పెట్టడం సాధారణమైపోయింది. ఈ మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అందులో ముఖ్యమైనది ఆటిజం. సాంకేతిక పరికరాల వినియోగం పెరుగుతున్న కొద్దీ చిన్నారుల్లో ఆటిజం సమస్య కూడా పెరుగుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు చురుకుగా లేకపోవడం, ఎవరితోనూ కలవకపోవడం, ఒంటరిగా ఉండడం, మాట ఆలస్యంగా రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయరాదని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా మూడు నెలల వయస్సు నుంచే శిశువు తల్లిని గుర్తుపడుతుంది. కానీ ఆటిజం ఉన్న పిల్లల్లో ఈ స్పందన కనిపించకపోవడం ఒక ముఖ్య లక్షణంగా వైద్యులు చెబుతున్నారు. మన దేశంలో దాదాపు 2 శాతం పిల్లలు ఆటిజం సమస్యతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఆటిజం ఉన్న పిల్లల్లో నిద్రలేమి, ఆందోళన, మూర్ఛ, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు కూడా కనిపించే అవకాశముంది. ఆటిజంపై అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 2వ తేదీని ప్రపంచ ఆటిజం అవగాహన దినంగా ప్రకటించింది. ఆటిజం ఉన్న పిల్లలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.

### ఇతర పిల్లలతో కలిసేలా ప్రోత్సహించాలి

ఆటిజాన్ని పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా, ముందుగా గుర్తిస్తే పిల్లల అభివృద్ధిని మెరుగుపరచవచ్చు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటేనే చిన్నారుల భవిష్యత్తు మెరుగుపడుతుంది. ఇతర పిల్లలతో కలిసేలా ప్రోత్సహించాలి. ఆటలు ఆడేలా, డ్యాన్స్, పాటలు వంటివి అలవాటు చేయాలి.

- డాక్టర్ మనోజ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్, ముషీరాబాద్ అర్బన్ పీహెచ్‌సీ దవాఖాన

### ఆటిజం అంటే ఏమిటి?

ఆటిజం అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే నాడీ సంబంధిత అభివృద్ధి లోపం. దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ) అని కూడా పిలుస్తారు. ఇది పిల్లల సామాజిక నైపుణ్యాలు, సంభాషణ సామర్థ్యం, ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. జాతి, లింగం, ఆర్థిక స్థితి వంటి భేదాలు లేకుండా ఎవరినైనా ప్రభావితం చేసే సమస్యగా ఇది గుర్తించబడింది.

### ఆటిజం ప్రధాన లక్షణాలు:

- కళ్లలోకి చూసి స్పందించకపోవడం
- పేరు పిలిచినా స్పందించకపోవడం
- మాట ఆలస్యంగా రావడం, మాట్లాడకపోవడం
- ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం
- ఇతర పిల్లలతో కలవకపోవడం
- ఒకే పనిని పదే పదే చేయడం
- నవ్వినా స్పందించకపోవడం

### ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి?

**వైద్య నిపుణుల సూచనలు:**

- గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- పోషకాహారం తీసుకోవాలి.. వాయు కాలుష్యం నుండి దూరంగా ఉండాలి
- ధూమపానం, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఒత్తిడి తగ్గించే వ్యాయామాలు చేయాలి
- అవసరమైన టీకాలు తీసుకోవాలి.. శిశువు ఎదుగుదలను పర్యవేక్షించాలి
- తల్లిదండ్రులకు సూచనలు.. పిల్లలకు సెల్‌ఫోన్, ట్యాబ్‌ల వాడకం తగ్గించాలి
- పిల్లలతో మాట్లాడాలి.. కథలు చెప్పాలి.. ఆటలు ఆడించాలి



## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## అన్నం పెట్టిన కేసీఆర్‌నే కడియం తిట్టిండు: కౌశిక్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఆయనకు టిక్కెట్ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గత ఎన్నికల్లో పోటీ చేసిన కడియం శ్రీహరిని తాము మీరు ఏ పార్టీలో ఉన్నారని సభలో అడిగితే తప్పేమిటని ప్రశ్నించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీలో ఉంటే కేసీఆర్, హరీశ్ రావుపై విమర్శలు ఎందుకు చేశారో చెప్పాలని అన్నారు. సభలో ఆయన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వద్ద కూర్చున్నారని, అందుకే అడిగామని వెల్లడించారు. అసలు ఆయన ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మైనింగ్ కుంభకోణాన్ని హరీశ్ రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని అన్నారు. మైనింగ్ స్కాం మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. హౌస్ కమిటీ వేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న సమస్య ఏమిటని ప్రశ్నించారు. సీఐడీ విచారణకు ఆదేశిస్తామని ప్రభుత్వం చెబుతోందని, మంత్రి మీద సీఐడీ విచారణ వేస్తే న్యాయం జరుగుతుందా అని నిలదీశారు. మంత్రిని అధికారులు విచారించే అవకాశం ఉంటుందా అని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ తనను టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని అన్నారు.

# 8 వేల కోట్లు 'హ్యామ్'మ్యాం!

## రోడ్ల అభివృద్ధి పేరిట లూటీ.. కాంగ్రెస్ సర్కారుపై వేముల ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఈవార్తలు) : కొత్త రోడ్ల అభివృద్ధి పేరిట కాంగ్రెస్ రూ.8వేల కోట్ల లూటీకి తెరతీసిందని, ప్రభుత్వం తెచ్చింది హ్యామ్ మోడల్ కాదు.. పక్కా స్కామ్ మోడల్' అంటూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం కనీసం 25శాతం కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో తొమ్మిదిన్నరేండ్లలో 10వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని గుర్తుచేశారు. రేవంత్ రెండున్నరేండ్ల పాలనలో కొత్తగా వేసిన రోడ్లు 112 కి.మీలు మాత్రమేనని దుయ్యబట్టారు. 60ఏండ్ల సమైక్యపాలనలో 30లక్షల చదరపు అడుగుల బిల్డింగ్స్ నిర్మిస్తే, కేసీఆర్ పాలనలో 2కోట్ల చదరపు అడుగులు నిర్మించారని వివరించారు. ఈ గణంకాలే రోడ్ల అభివృద్ధిపై కాంగ్రెస్ చిత్తశుద్ధిలేమికి అద్దంపడుతున్నదని ధ్వజమెత్తారు. నిధులివ్వకపోవడంతో రాష్ట్రంలోని రహదారులు అధ్వానంగా మారినా ప్రభుత్వం కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయడం లేదని, ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్ల నిర్మాణంలో సర్కార్ నిర్లక్ష్యాన్ని గణాంకాలతో ఎండగట్టారు. బాల్కొండ నియోజవర్గంలోని కప్పలవాగు వంతెన వర్షాలకు దెబ్బతిని తొమ్మిది నెలలు గడిచినా కేవలం రూ.3 కోట్లు వెచ్చించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి ముక్తి

**అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా**



రాజేంద్రనగర్-రంగారెడ్డి, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రాజేంద్రనగర్ మండలం శాస్త్రిపురంలో ఆటస్థలం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఐదు భవనాలను బుధవారం కూల్చివేసింది. భారీ భద్రత నడుమ ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన 188 ఎకరాల లేఅవుట్‌లో 6,500 చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసి, నకిలీ నోటరీ పత్రాలతో ఇతరులకు ప్లాట్లుగా విక్రయించారు. ఈ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఐదు జీ ప్లస్ 3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను కూడా హైడ్రా బృందాలు నేలమట్టం చేశాయి. అయితే, మరో రెండు భవనాల్లో కొన్ని కుటుంబాలు నివసిస్తుండటంతో మానవతా దృక్పథంతో వాటిని కూల్చివేయలేదు. గతంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈ కబ్జాదారులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులతో హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కబ్జాలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు 2024లో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు రూ.60,000 కోట్ల విలువైన 1,045 ఎకరాల ప్రభుత్వ భూములు, జలవనరులను తిరిగి స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో బంజారాహిల్స్‌లో రూ.750 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

# కాజీపేట రైల్వే డివిజన్ ఇవ్వాలి

**కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. కేటీఆర్ రాసిన లేఖను బీఆర్ఎస్ ఎంపీల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రికి అందించింది. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ ఎంపీలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉందని, మున్ముందు వాడి-రాయచూర్, విష్ణుపురం-బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

# చెరువుగట్టున నాలుగేళ్ల చిన్నారి మృతదేహం

**నారాయణపేట జిల్లాలో కలకలం**

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఈవార్తలు): నారాయణపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారి దారుణ హత్యకు గురైంది. అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు చిన్నారిని హతమార్చి, మృతదేహాన్ని గ్రామ సమీపంలోని చెరువుగట్టు వద్ద పడేసి వెళ్లారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువు సమీపంలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించి, పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. చిన్నారి తల్లిదండ్రులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. దీంతో పాప తన అవ్వాతాతల సంరక్షణలో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో చిన్నారి హత్యకు గురవ్వడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ దారుణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

# నాతో టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీలు

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడి**



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు తమతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు ప్రకటిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, అసెంబ్లీలో సమయం అంతా అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం తిట్లు, విమర్శలు చేసుకోవడానికే సరిపోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను శ్రీరాముడిని, కేసీఆర్ రావణుడు అని చెబుతున్నారని, కానీ శకుని ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. తాను బర్బరీకుడిని అని ముఖ్యమంత్రి చెప్పుకుంటుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మావోయిస్టులు కూడా తమ పార్టీలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారిది, తమది ఒకే అజెండా అని తెలిపారు. పార్టీ ఆవిర్భావానికి ముందు ఉమాభారతి సహా ఇతర పెద్దలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని కవిత తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 40 లక్షల కుటుంబాలలోని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని ఆరోపించారు. 15 లక్షల రేషన్ కార్డులు తీసివేయాలని చూస్తోందని మండిపడ్డారు.

# అమరావతి సరే.. తెలంగాణ సంగతేంది?

**కేంద్రానికి మంత్రి పొన్నం ప్రశ్నలు**

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.



# ‘ఆర్కేడీసీ’లో సంప్రదాయ సంబురాలు

**అట్టహాసంగా ఎత్నిక్ డే వేడుకలు.. ఉత్సాహంగా పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో బుధవారం ఎత్నిక్ డే (సంప్రదాయ దినోత్సవం) సంబురాలు అట్టహాసంగా జరిగాయి. కాలేజీకి చెందిన బీకాం, బీబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో భాగంగా పలు సంప్రదాయ వంటకాల స్టాళ్లను ఏర్పాటు చేసి జిహ్వాకు రుచి చూపించారు. సంబురాల్లో పాల్గొన్న కాలేజీ చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, కానీ తొలిసారి జగిత్యాల పట్టణంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంస్కృతి, సంప్రదాయాలు ఎన్నో మార్పులకు లోనయ్యాయని, అయినా ‘ఎత్నిక్ డే’లో విద్యార్థులు గత అనుభూతులను గుర్తుచేశారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సంబురాల్లో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, కామర్స్ విభాగపు ఆధ్యాపకులు జే రాకేశ్, అప్సర్, అక్బర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తాం

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం**

**చొప్పదండి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు**

**రానున్న రోజుల్లో మరిన్ని: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



గంగాధర, ఏప్రిల్ 1 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు అర్కుటి భూధమ్మ,ఆదుర్తి కళ్యాణి ఎల్లయ్య, ఆదుర్తి కళ కిషన్,కనుకుంట్ల మైహిత రాజశేఖర్ గృహప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు అర్కుటి భూధమ్మ,ఆదుర్తి కళ్యాణి ఎల్లయ్య, ఆదుర్తి కళ కిషన్,కనుకుంట్ల మైహిత రాజశేఖర్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కురిక్యాల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని 208 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 94 మంది లబ్ధిదారులు సొంత ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశం చేసినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో నాటి కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అంబటి రజిత, ఎండిఓ దామ్ రాము, స్థానిక సర్పంచ్ కదారి హారిక కనకయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు పురుమల్ల మనోహర్, సర్పంచ్లు సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రేండ్ల శ్రీనివాస్, రామిడి రాజిరెడ్డి, బీర్ల ఆనందం,చిందం ఆంజనేయులు,మేర్గ కొండయ్య, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,మ్యాక వినోద్,అర్కుటి లింగయ్య ,రాగుల సుధాకర్, మేర్గ శ్రీనివాస్, మంత్రి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం

**యుద్ధ ప్రాతిపాదికన అంచనాలు సిద్ధం చేయాలి**

**అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశాలు**

గొల్లపల్లి, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానలతో జగిత్యాల జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో నష్టాల అంచనాలను యుద్ధ ప్రాతిపాదికన సిద్ధం చేయాలని అధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. గొల్లపల్లి మండలం భీమరాజుపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను మంత్రి బుధవారం వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. పొలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 6,160 ఎకరాల్లో మామిడి, 1,029 ఎకరాల్లో వరి, 1,520 ఎకరాల్లో మొక్కజొన్న, 581 ఎకరాల్లో నువ్వుల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారని చెప్పారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడులు పూర్తయ్యి పంట చేతికి వచ్చే సమయంలో నష్టం జరగడం రైతులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయి అంచనాలు రూపొందించి వెంటనే నివేదిక పంపాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. రైతులకు త్వరితగతిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## బైక్ దొంగల అరెస్ట్.. 5 బైక్స్ స్వాధీనం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో గత 15 రోజులుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు..అరెస్ట్ అయిన వారు మండలి పవన్ కళ్యాణ్, అంపోల సాయి కృష్ణగా గుర్తించారు. వీరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు బైకులను దొంగతనం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నామని, వాటి మొత్తం విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు..దొంగలను పట్టుకొని బైకులను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ కానిస్టేబుళ్లు జి. జీవన్, ఎన్. చంద్రశేఖర్, పి. రాజిరెడ్డిలను సీఐ అభినందించారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన ఏఎంసీ కార్యవర్గం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా నియమితులైన గడ్డం నారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డా.సంజయ్ ను ఏఎంసి కార్యవర్గ సభ్యులు శాలువాతో సన్మానించి తమ నియమాకానికి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



# తల్లిదండ్రులు అంటే భయం, భక్తి ఉండాలె

**అందుకే తల్లిదండ్రుల సంరక్షణ చట్టం తెచ్చాం.. ఫిర్యాదు చేసిన 60 రోజుల్లో సమస్య పరిష్కారం: అడ్లూరి**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): అనేక కష్టనష్టాలకు ఓర్చి పిల్లలను ప్రయోజకులను చేస్తే వృద్ధాప్యంలో తల్లి దండ్రుల పోషణ మరచిపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారి కోసం ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ, పర్యవేక్షణ చట్టం 2026 తీసుకువచ్చామని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ పర్యవేక్షణ చట్టంపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్స్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పోషణ పరిరక్షణ పట్టించుకోని కొడుకులకు భయం భక్తి ఉండటానికి కొత్త చట్టం తీసుకు వచ్చామని మంత్రి లక్ష్మణ్ తెలిపారు. బాధిత తల్లి దండ్రులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసే 60 రోజుల్లో విచారణ జరిపి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. కొత్త చట్టం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు సైతం చట్టం వర్తిస్తుందని మంత్రి తెలిపారు. అసెంబ్లీలో, మండలిలో బిల్లు ప్రవేశ పెట్టడానికి అవకాశం రావడం సంతోషంగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనేక రకాలుగా ఆలోచన చేసి కొత్త చట్టం తీసుకు వచ్చారని మంత్రి తెలిపారు. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అన్నారు. కొత్త చట్టాన్ని అమలు చేయడానికి పోలీసుల సహకారం తీసుకోవాలని మంత్రి సూచించారు. చట్టం అమలు పై రాష్ట్ర డీజీపీతో పాటు జిల్లా పోలీసు అధికారులకు తాను లేఖ రాస్తానని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తీసుకు వచ్చిన తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ-జవాబుదారీతనం మరియు పర్యవేక్షణ చట్టం 2026 దేశంలో ఎక్కడ లేని చట్టం అని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజా అన్నారు. అస్సాం రాష్ట్రంలో ఉన్న చట్టం కంటే అనే పదునైన చట్టమని శైలజా అన్నారు. ప్రభుత్వ ఉ



ద్యోగాలతో పాటు రిజిస్టర్ అయిన ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం చట్టం వర్తిస్తుందని శైలజా తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారని ప్రస్తుతం వీరి సంఖ్య 48 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని శైలజా వివరించారు. తల్లిదండ్రులను కొడుకులు పట్టించుకోకుండా జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసే విధంగా చట్టాన్ని రూపొందించామని ప్రత్యేక ఆఫిలెట్ అధికారిని నియమించమని శైలజా తెలిపారు..ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జనసేన ఆధ్వర్యంలో గుర్రపు పందేలు

పిఠాపురం/కాకినాడ, ఏప్రిల్ 1 (ఈవార్తలు): ఏపీలోని పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రాష్ట్రస్థాయి గుర్రపు పరుగు పందేలు నిర్వహించారు. సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పవన్ కల్యాణ్ నివాసం వెనకాల గల అడవి పుంత రోడ్డులో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు ఓదూరి కిశోర్, ఓరుగంటి పెదకాపు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల నుంచి రాష్ట్రస్థాయి గుర్రం పరుగు పోటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పురాతన కాలం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 35 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఓదూరి నాగేశ్వరరావు, ఓరుగంటి వినయ్ ప్రజలు పాల్గొన్నారు.



## 6న హిందూ సమ్మేళనం.. కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో జరిగే హిందూ సమ్మేళనం కరపత్రాన్ని తీగుళ్ల విశ్వనాథ శర్మ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న రామాలయ ఆవరణలోని వాకింగ్ లో గ్రౌండ్ హిందూ సమ్మేళనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, గోమాత పూజా కార్యక్రమం, సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం, అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అడ్లూరికి శుభాకాంక్షల వెల్లువ



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆయనను జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో బుధవారం జగిత్యాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మీర్ ఖాజీం అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. అడ్లూరికి వారు పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పెన్షన్లు అందజేసిన చిక్కాల వరలక్ష్మి



పిఠాపురం/కాకినాడ, ఏప్రిల్ 1 (ఈవార్తలు: ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఘనంగా జరిగింది. పిఠాపురం పట్టణ జనసేన పార్టీ ఇంచార్జ్ చిక్కాల వరలక్ష్మి రమణరావు ఆధ్వర్యంలో పిఠాపురంటౌన్ 1, 4, 6, 14, 25, 26, 29 వార్డులలో ఆయా వార్డ్ ఇంచార్జ్‌లు, సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ వార్డ్ ఇంచార్జులు గంట బాబీ, గరగ అయ్యప్ప, ముమ్మిడి సురేశ్, వనం వీరబాబు, బీ శ్రీనివాస్, సురావరపు వెంటేశ్వరావు, సురేశ్, ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన జగిత్యాల క్లబ్ సెక్రటరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల క్లబ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో క్లబ్ సెక్రటరీగా విజయం సాధించిన పులి రాము బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను శాలువాతో సన్మానించగా, నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బొడ్ల జగదీశ్వర్, కోశాధికారి పేరాల వెంకటేశ్వరరావు, క్రీడ కార్యదర్శి జంగిలి శశికాంత్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## జీపీల పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించాలి

**అదనపు కలెక్టర్‌కు ఎస్ఈ సుదర్శనం వినతి**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని గ్రామ పంచాయితీలకు సంబంధించిన గత కొద్ది కాలంగా పెండింగ్ ఉన్న విద్యుత్ బకాయిలను చెల్లించాలని కోరుతూ బుధవారం జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ ను ఎస్ఈ సుదర్శనం కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ బకాయిల జాబితాను అందించారు. అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యుత్ శాఖ జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారం, ఎస్ఏఓ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అడ్లూరి జన్మదిన వేడుకలు



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 (ఈవార్తలు): రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఆడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అదేమన్నా మా యుద్ధమా?

## ఇరాన్‌తో యుద్ధం చేయం.. ట్రంప్‌కు బ్రిటన్ షాక్



లండన్: పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధిలో తీవ్ర అంతరాయాలు నెలకొన్న క్రమంలో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే మార్గాలపై చర్చించేందుకు ప్రపంచస్థాయి సదస్సు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రతి దౌత్యమార్గాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. అయితే ఇరాన్ యుద్ధంలోకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ దిగబోమని తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధి విషయంలో తన మాట వినని యూకేకు అమెరికా సాయం చేయబోదన్న ట్రంప్ హెచ్చరికలపై స్టార్మర్ స్పందిస్తూ.. ఎవరు ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా బ్రిటిష్ జాతీయ ప్రయోజనాల కోసమే ఆలోచిస్తానన్నారు. అది తమ యుద్ధం కాదని, అందువల్లే అందులోకి వెళ్లదలుచుకోలేదని స్పష్టంచేశారు. ప్రస్తుత సంఘర్షణలతో యూకే భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం పడుతోందని.. ఇంధన సరఫరాకు అంతరాయం కలగడంవల్ల జీవన వ్యయం పెరుగుతుందని అన్నారు. అయినప్పటికీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశం సిద్ధంగా ఉందని స్టార్మర్ చెప్పారు. ప్రస్తుత సమయంలో అమెరికాతో కంటే సహచర ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు కలిగి ఉండటమే బ్రిటన్‌కు ప్రయోజనకరమని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.

# నాటో నుంచి వెళ్లిపోతాం

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో సైనిక కూటమిపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటో ఒక 'కాగితపు పులి' అని అభివర్ణిస్తూ, కూటమి నుంచి వైదొలగే విషయం పునఃపరిశీలన స్థాయి కూడా దాటిపోయింది అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో సైనిక ఘర్షణ విషయంలో యూరప్ మిత్రదేశాలు మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు నాటో దేశాలు ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. ఈ విషయంలో మిత్రదేశాలు 'పిరికిపందలు' అంటూ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఘాటుగా పోస్ట్ చేశారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, నాటో నుంచి వైదొలగడం గురించి మాట్లాడుతూ, "అవును, ఈ విషయం గురించి ఇక ఆలోచించడానికేమీ లేదు. నేను నాటోను ఎప్పుడూ కాగితపు పులిగానే చూశాను, ఈ విషయం పుతిన్‌కు కూడా తెలుసు" అని స్పష్టం చేశారు. "మేం ఉక్రెయిన్ విషయంలో వారికి (నాటో దేశాలకు) అండగా నిలిచాం. కానీ ఇరాన్ విషయంలో వారు మాకు మద్దతుగా నిలవలేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా మద్దతు తెలిపారు. "మనకు అవసరమైనప్పుడు సైనిక స్థావరాలను నిరాకరించే మిత్రదేశాలతో కూటమి వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ప్రశ్నించారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ సైనిక స్థావరాలను, గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికాకు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. మిత్రదేశాల వైఖరితో 77 ఏళ్ల నాటి నాటో కూటమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది.



## స్టార్‌లింక్‌ను వదిలిపెట్టం: ఇరాన్

టెహ్రాన్: అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. పొరుగు దేశాల్లోని అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులకు దిగుతామని, ఈ క్రమంలోనే ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థపై విరుచుకుపడతామని స్పష్టం చేసింది. బహ్రెయిన్, కువైట్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాల్లో స్టార్‌లింక్ కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో అక్కడి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇరాన్ దాడుల కారణంగా గల్ఫ్ దేశాల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లు సంభవిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పలు దేశాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న సుమారు 18 అమెరికా టెక్ కంపెనీల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ తెలిపింది. ఈరోజు నుంచి యాపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టెస్లా, బోయింగ్ వంటి ఇతర దిగ్గజ కంపెనీల యూనిట్లపై కూడా దాడులు చేసే అవకాశం ఉందని ఇరాన్ సైన్యం సంకేతాలిచ్చింది. ఆయా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రాణాలు కాపాడుకోవాలంటే తక్షణమే ఆ ప్రాంతాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. కాగా, ఇరాన్‌లో ఇప్పటికే స్టార్‌లింక్‌పై నిషేధం అమల్లో ఉంది. ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నారు.

## భారత్ మార్కెట్‌పై అమెరికా పెత్తనం చెల్లదు: రష్యా

మాస్కో: భారత్, రష్యా మధ్య చమురు వాణిజ్యం విషయంలో అమెరికా అనవసరంగా ఒత్తిడి తెస్తోందని, ఈ చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. భారత్ ఎల్లప్పుడూ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్నే అనుసరిస్తోందని, బయటి శక్తుల ఒత్తిడులను తిరస్కరించడాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... భారత మార్కెట్‌లో రష్యాకు అడ్డంకులు సృష్టించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని అలిపోవ్ అన్నారు. అంతర్జాతీయ రాజకీయాల్లో ఇలా ఒత్తిడి తీసుకురావడం, వ్యాపార సంబంధాలను దెబ్బతీయడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. "అంతర్జాతీయంగా వ్యాపారం చేసే విధానం ఇది కాదు. భారత చమురు మార్కెట్‌పై అమెరికా ఒత్తిడిని మేము తిరస్కరిస్తున్నాం. భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించడాన్ని మేం ఎంతో అభినందిస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలంలో రష్యా, భారత్ మధ్య సంబంధాలు, ముఖ్యంగా ఇంధన రంగంలో మరింత బలపడ్డాయని అలిపోవ్ తెలిపారు. రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయని ఆయన గుర్తుచేశారు. "ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు విస్తరిస్తున్నాయి. ఇరు పక్షాల ప్రయోజనాల కోసం ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని ఆయన వివరించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ఇంధన మార్కెట్లలో తీవ్ర అస్థిరతకు అమెరికా అనుసరిస్తున్న "చమురు అంతరాయ దౌత్యమే" కారణమని ఆయన పరోక్షంగా విమర్శించారు. అయితే, రష్యా-భారత్ మధ్య వాణిజ్యం, ముఖ్యంగా చమురు వ్యాపారం అభివృద్ధి పథంలోనే కొనసాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటన గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రధాని మోదీ రష్యాలో పర్యటిస్తే మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని అలిపోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఏటా శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించే సంప్రదాయం ఉందని, గతేడాది డిసెంబర్‌లో రష్యా అధ్యక్షుడు భారత్‌లో పర్యటించారని గుర్తు చేశారు.

# తండ్రి కంటే కొడుకు నయం

**ఇరాన్ పాలకుడిపై ట్రంప్ వ్యాఖ్యలు**



వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు

**మరో కేసు నమోదు చేసిన సీబీఐ**



ముంబై: పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు. ఎల్ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీడీవో ఇండియా ఎల్ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది. ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు కూడా. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.



## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన హాజరుకాకపోవడంతో దాఖలైన కేసుల్లో ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈడీ తరపున న్యాయవాది జొహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినా, ఆయన తరఫున ఎవరూ హాజరుకాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించడం ద్వారా ట్రయల్ కోర్టు తీవ్రమైన తప్పిదం చేసిందని వాదించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జారీ చేసిన సమన్లు ఆయనకు అందినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. అలాగే, ట్రయల్ కోర్టు రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. గతంలో పీఎంఎల్ఏ సెక్షన్ 50 కింద ఈడీ జారీ చేసిన ఐదు సమన్లను కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు చేసింది. అయితే, ఈ ఫిర్యాదులను విచారించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరాస్ దలాల్, కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పునే ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది. ఇదే సమయంలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా హైకోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు విచారణను జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం నుంచి మరో బెంచ్‌కు బదిలీ చేయాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. విచారణ నిష్పాక్షికతపై తనకు సహేతుకమైన అనుమానాలు ఉన్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## టాటా, మారుతి, టయోటా లాబాల జోరు

ముంబై: భారత ప్యాసింజర్ వాహన మార్కెట్ 2026 ఆర్థిక సంవత్సరాన్ని ఘనంగా ముగించింది. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్ వంటి ప్రధాన కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని నమోదు చేసి సత్తా చాటాయి. మారుతీ సుజుకీ ఇండియా 2026 మార్చిలో 2,25,251 యూనిట్లను విక్రయించి, గతేడాదితో పోలిస్తే 16.72 శాతం వృద్ధిని సాధించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ సుమారు 3 శాతం వృద్ధిని నమోదు




చేసింది. ముఖ్యంగా, 2026 ఆర్థిక సంవత్సరంలో 4.47 లక్షలకు పైగా వాహనాలను ఎగుమతి చేసి ఆల్-టైమ్ రికార్డు సృష్టించింది. ఇది 34 శాతం పెరుగుదల కావడం విశేషం. మరోవైపు, టాటా మోటార్స్ తన చరిత్రలోనే అత్యధికంగా వార్షిక అమ్మకాలను నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరంలో సుమారు 6.42 లక్షల యూనిట్లను విక్రయించి 15 శాతం వృద్ధిని సాధించింది. కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల పోర్ట్‌ఫోలియోకు మంచి ఆదరణ లభించింది. ఈవీ అమ్మకాలు 43 శాతం పెరిగి 92,000 యూనిట్లు దాటాయి. సీఎన్‌జీ విభాగం కూడా 24 శాతం వృద్ధితో రాణించింది. అమ్మకాల పరంగా ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో టాటా మోటార్స్ రెండో స్థానంలో నిలిచింది. ఇదే బాటలో టయోటా కిర్లోస్కర్ మోటార్ కూడా 2026 ఆర్థిక సంవత్సరంలో 4,06,081 యూనిట్లను విక్రయించి 20 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి నెలలో కూడా 24 శాతం పెరుగుదలతో 37,194 యూనిట్ల అమ్మకాలను సాధించింది. ఎస్‌యూవీ, ఎంపీవీ, కాంపాక్ట్ సెగ్మెంట్లలో నిలకడైన డిమాండ్, కొత్త ఉత్పత్తుల విడుదల తమ వృద్ధికి కారణమని కంపెనీ తెలిపింది. భవిష్యత్తులో హైబ్రిడ్, ఎలక్ట్రిఫైడ్ టెక్నాలజీలపై దృష్టి సారిస్తామని పేర్కొంది.

## యూపీఐ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బుధవారం డిజిటల్ చెల్లింపు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సేవల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం, ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా, యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతో పాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని తెలిపారు. ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ అవ్వలేదు. ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. "ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలగవచ్చు," అని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈ-రూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.

## ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్‌కు ముడిచమురు

అహ్మదాబాద్: ఇరాన్ నుంచి ఒక చమురు ట్యాంకర్ భారత్ వైపు వస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసింది. దీనితో ఇరాన్ ముడిచమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి వస్తున్న చమురు ట్యాంకర్ ఏప్రిల్ 4న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకోనుంది. ఈ మేరకు డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ వెల్లడించింది. గత నెల 4వ తేదీన ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంకర్ లోకి ముడి చమురు లోడింగ్ చేశారని తెలిపింది. ఇందులో 6,00,000 బ్యారెళ్ల ముడి చమురు ఉండొచ్చని అంచనా. 2019 తర్వాత ఇరాన్ చమురు భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. అయితే ఈ చమురు కొనుగోలుదారు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. వాడినార్‌లో రష్యాకు అతిపెద్ద వాటా కలిగిన నయారా ఎనర్జీ నిర్వహిస్తున్న రిఫైనరీ ఉంది. అదే సమయంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) నిర్వహిస్తున్న మధ్యప్రదేశ్‌లోని బినా రిఫైనరీ దిగుమతి చేసుకునే ముడిసరుకు పంపిణీ కేంద్రం కూడా ఇక్కడే ఉంది. 2019 వరకు భారత చమురు దిగుమతుల్లో 11.5 శాతం ఇరాన్ వాటా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా, మే 2019 నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశం నుంచి చమురు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి.

## విజయన్ గెలిచేలా మోదీ ప్లాన్

**కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి**

తిరువనంతపురం: కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.

## అసోం తోటల్లో ప్రధాని మోదీ

దిబ్రుగఢ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు. అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు. అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

వయ్యారి చిత్రం



కాజోల్ అరోరా



## దళపతి ప్లాన్ బీ రెడీ?

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వ్యవస్థాపకుడు, కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ రెండు నియోజక వర్గాల నుంచి పోటీకి దిగుతున్న విషయం తెలిసిందే. టీవీకే పార్టీని స్థాపించి సినిమాలకు గుడ్ బై చెప్పేస్తూ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. పార్టీ ప్రకటించి భారీ బహిరంగ సభ నిర్వహించిన నాటి నుంచే విజయ్ అనేక సమస్యలని ఎదుర్కొంటూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. ఆయన నటించిన చివరి సినిమా -జన నాయగన్- రిలీజ్ వాయిదా పడింది. ఎప్పుడు రిలీజ్ అవుతుందో క్లారిటీ లేదు. ఇదే సమస్యతో సతమతమవుతున్న వేళ విజయ్ భార్య సంగీత విడాకులు కోరుతూ చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టుని ఆశ్రయించడం సంచలనంగా మారింది. తనయుడు జాసన్ సంజయ్ తండ్రి విజయ్‌ని సోషల్ మీడియాలో అన్ ఫాలో చేయడం, ఇంటి పేరుని తొలగించుకోవడం..ఇదే సమయంలో త్రిషతో కలిసి చెన్నైలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి విజయ్ హాజరు కావడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తడం తెలిసిందే. తన చుట్టూ ఇంత జరుగుతున్నా చలించని విజయ్ ఫైనల్‌గా టీవీకే పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో రెండు చోట్ల నుంచి పోటీకి విజయ్ సిద్ధమవుతున్నారు. పెరంబూరు, తిరుచిరాపల్లి ..ఈ రెండు నియోజక వర్గాల నుంచి విజయ్ పోటీ చేస్తున్నారు. రెండు నియోజక వర్గాల్లో ఒక చోట నుంచి గెలిచినా తమిళ రాజకీయాల్లో చక్రం తిప్పడం ఖాయం. ఆ నమ్మకంతోనే విజయ్ ఈ రెండు నియోజక వర్గాలని పోటీ కోసం ఎంచుకున్నారట.



## ప్రాణాలకు తెగిస్తున్న కొరియన్ భామలు

కొరియన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో హీరోయిన్ల బరువు తగ్గుదల ఇప్పుడు కేవలం ఫిట్‌నెస్ చర్చగా కాకుండా ఆరోగ్యపరమైన ఆందోళనగా మారుతోంది. ఇటీవల కిమ్ జి- వోన్, హా జి- వోన్, పార్క్ మిన్- యంగ్ లాంటి ప్రముఖ నటీమణులు విపరీతంగా బరువు తగ్గి కనిపించడంతో, వారి డైట్ పద్ధతులపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ మొదలైంది. మరీ ప్రత్యేకంగా నీళ్లు మరియు ఆల్కహాల్ డైట్ లాంటి విషయాలు బయటకు రావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఎలాంటి పోషకాహారం లేకుండా కేవలం లిక్విడ్స్ పై ఆధారపడటం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ అందకపోవడం వల్ల తీవ్ర బలహీనత, హార్మోన్ అసమతుల్యత, ఇమ్యూనిటీ తగ్గడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాత్కాలికంగా బరువు తగ్గినా, దీర్ఘకాలంలో ఇది శరీరాన్ని దెబ్బతీసే ప్రమాదకర మార్గమని వారు స్పష్టం చేస్తున్నారు. ఇక మరోవైపు, ఈ మార్పులను కేవలం ప్రమాదంగా చూడలేమని కూడా కొందరు అభిప్రాయపడుతున్నారు. నటనలో భాగంగా పాత్రకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ హీరోయిన్లు తమ శరీరాన్ని పూర్తిగా మార్చుకోవడం వారి డెడికేషన్‌ను చూపిస్తుంది. ఉదాహరణకు, ఒక పాత్ర కోసం బరువు తగ్గడం, మసిల్స్ తగ్గించుకోవడం అనేది సులభమైన విషయం కాదు. అయితే, ఈ త్యాగం ఎంతవరకు సరైనది? అది ఆరోగ్యానికి హాని కలిగిస్తే, అది నిజంగా కళ కోసం చేసిన త్యాగమా లేక ప్రమాదకరమైన ఒత్తిడికి లోనవడమా అన్న ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సినిమా ఇండస్ట్రీలోని బ్యూటీ స్టాండర్డ్స్ కూడా విమర్శలకు గురవుతున్నాయి. ముఖ్యంగా కొరియన్ డ్రామా ప్రపంచంలో హీరోయిన్లు అత్యంత సన్నగా ఉండాలి అనే అప్రకటిత నిబంధన ఉన్నట్టు అనిపిస్తోంది.

## ఆ పని మాత్రం చేయను: సమంత


స్టార్ హీరోయిన్ సమంత హెల్త్, ఫిట్‌నెస్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటుందో మనందరికీ తెలిసిందే. తాజాగా ఆమె తన 'పవర్ మార్నింగ్' రొటీన్‌ను అభిమానులతో పంచుకుంటూ ఒక స్పెషల్ వీడియో పోస్ట్ చేసింది. సమంత చెప్పిన మొదటి, అతి ముఖ్యమైన రూల్ ఏంటంటే.. నిద్రలేవగానే గంట వరకు ఫోన్ ముట్టుకోకూడదు. ఇక సాధారణంగా మనం కళ్లు తెరవగానే వాట్సాప్ మెసేజ్‌లు, ఈమెయిల్స్ చూస్తూ ఒత్తిడికి గురవుతాము. కానీ సమంత మాత్రం నిద్రలేవగానే మన శరీరంలో ఉండే ఒత్తిడి హార్మోన్లను అదుపులో ఉంచుకోవడానికి ఫోన్‌ను పక్కన పెట్టేయాలని సూచించింది. ఇక అలా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండి, కొత్త రోజును ఆహ్వానించడానికి సిద్ధమవుతానని ఆమె తన అనుభవాన్ని పంచుకుంది. నిద్రలేవగానే ఐదు నిమిషాల పాటు ధ్యానం చేయడం, కాసేపు సూర్యరశ్మి తగిలేలా కూర్చోవడం తన దినచర్యలో భాగమట. ఇక హెల్త్ డ్రింక్ విషయానికొస్తే.. గోరువెచ్చటి నీళ్లలో పసుపు, నిమ్మరసం కలిపి తాగుతుందట. అలాగే 11 గంటల లోపే వర్కౌట్లు పూర్తి చేసి, ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం వల్ల రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చని ఆమె వివరించింది.



## నాతో పెట్టుకుంటే అణు విస్ఫోటం



బాలీవుడ్ లో భూమీ పడ్నేకర్ ఎలా ఎదిగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. చిన్న చిన్న పాత్రలతో ప్రయాణం మొదలు పెట్టి అంచలంచెలుగా నటిగా ఎదిగింది. అక్కడ నుంచి కథానాయికగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అయితే కెరీర్ ప్రయాణంలో ఎదురైన సవాళ్లు, విమర్శలను ఆమె స్వీకరించే విధానం చాలా మందికి స్ఫూర్తినిస్తుంది. తనను ఎవరైనా తక్కువ చేసి మాట్లాడినా, లేదా తన సామర్థ్యాన్ని తక్కువ చేసి చూసినా భూమి ఏమాత్రం కుంగిపోకుండా ఆ ప్రతికూలతను తన విజయానికి మెట్టుగా మార్చుకోవడం ఆమెలో పట్టుదలకు నిదర్శనం. భూమి పడ్నేకర్ ఒక సందర్భంలో మాట్లాడుతూ -తనను ఎవరైనా తక్కువ చేసి చూసినప్పుడు తనలో ఓ అణు విస్ఫోటనం లాంటి కసి పుడుతుందంది. ఈ మాటతో ఆమెలో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని, లక్ష్యం పట్ల ఆమెకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తున్నాయి. విమర్శలు వచ్చినప్పుడు నిరాశకు గురికాకుండా ఆ శక్తిని సానుకూల మార్గంలో మళ్లించి పనితనంతో సమాధానం చెప్పడమే ఆమె నైజం.




## బాలయ్య కురుక్షేత్రం!

నందమూరి బాలకృష్ణ .. ఈ పేరు వింటేనే మాస్ ప్రేక్షకులకు పూనకాలు వచ్చేస్తాయి. వరుస విజయాల జోరులో ఉన్న బాలయ్య, తన తదుపరి చిత్రాల విషయంలో రూట్ మారుస్తున్నారు. ఒకవైపు గతంలో తనకు హిట్లు ఇచ్చిన దర్శకులతో మాస్ యాక్షన్ సినిమాలు చేస్తూనే, మరోవైపు యంగ్ దర్శకులతో విభిన్నమైన ప్రయోగాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయతో బాలయ్య చేయబోయే సినిమా ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 'అంటే సుందరానికి', 'సరిపోదా శనివారం' వంటి విలక్షణమైన కథలతో వివేక్ ఆత్రేయ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకున్నాడు. అలాంటి దర్శకుడు మాస్ గాడ్ బాలయ్యతో జతకట్టడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే చిత్రానికి 'కురుక్షేత్రం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ పేరు వినగానే నందమూరి అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇది మాస్ యాక్షన్ సినిమానా లేక మైథాలజికల్ టచ్ ఉన్న కథా? అనే చర్చ నడుస్తోంది. బాలయ్యకు పౌరాణిక, చారిత్రక పాత్రలు పోషించడంలో సాటిలేని అనుభవం ఉంది. గతంలో ఆయన 'శ్రీ రామ రాజ్యం', 'గౌతమీపుత్ర శాతకర్ణి' వంటి చిత్రాలతో తన తండ్రి ఎన్టీఆర్ వారసత్వాన్ని నిలబెట్టారు. ఇప్పుడు వివేక్ ఆత్రేయ మార్క్ విభిన్న కథనానికి, బాలయ్య మార్క్ గంభీరమైన డైలాగ్ డెలివరీ తోడైతే, వెండితెరపై మరో అద్భుతం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనుంది.

## గ్రాజియా ఈవెంట్‌లో సాక్షి మాలిక్ అందాల విందు



బమ్ డిగీ డిగీ సాంగ్‌తో కుర్రకారు గుండెల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన సాక్షి మాలిక్ తాజాగా జరిగిన గ్రాజియా ఫ్యాషన్ అవార్డ్స్ 2026 వేడుకలో తళుక్కుమంది. ఈ ఈవెంట్ కోసం సాక్షి ఎంచుకున్న వైట్ అండ్ వైట్ అవుట్‌ఫిట్ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. శ్వేత వర్ణపు దుస్తుల్లో దేవకన్యలా మెరిసిపోతుంటే కెమెరా కళ్లు అన్నీ ఈ బ్యూటీపైనే నిలిచిపోయాయి. ఫ్యాషన్ విషయంలో తనదైన ముద్ర వేయడానికి సాక్షి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ వేడుక మరోసారి నిరూపించింది. ముఖ్యంగా సాక్షి మాలిక్ ఇన్ స్టా వీడియోలో చూపిస్తున్న హొయలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇలా కెమెరా ముందు ఫోజులివ్వడమే కాదు.. తన సింపుల్ స్మైల్ తో పరిసరాల్లో వెలుగులు నింపింది. సాక్షి రాకతో కెమెరా ఫ్లాష్‌లు ఆగకుండా మెరుస్తూనే ఉన్నాయి. ఈ యంగ్ బ్యూటీ గ్రేస్ ..ఆత్మవిశ్వాసం రెడ్ కార్పెట్ పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## హెచ్‌సీఏలో రూ.600 కోట్ల అక్రమాలు!

### టీసీఏ కార్యదర్శి సంచలన ఆరోపణలు


హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హెచ్‌సీఏలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సీఐడీ చీఫ్‌లకు ఆయన ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏలో 20 ఏళ్లుగా నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటి వరకు రూ.600 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.69 కోట్లు బదిలీ కావడం కూడా అక్రమాల్లో భాగమేనని అన్నారు. ఐపీఎల్ టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని, దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆస్తులైన క్లబ్బులను ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




## ఐపీఎల్‌లో డబ్బులు రావు

### : ఆడమ్ జంపా

ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. "ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో




ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు" అని జంపా వివరించాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.




# ఢిల్లీ సూపర్ విక్టరీ

## రిజ్వీ అద్భుత పోరాటం.. లక్నోకు తప్పని ఓటమి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బుధవారం నాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేవలం 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన ఢిల్లీని, యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) తన అసాధారణ ఇన్నింగ్స్‌తో గెలిపించాడు. ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 119 పరుగులు జోడించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, టి. నటరాజన్ చెరో మూడు వికెట్లతో లక్నో పతనాన్ని శాసించగా, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 142 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లభించలేదు. కేఎల్ రాహుల్ (0), నితీశ్ రాణా (15), పతుమ్ నిస్సంక (1), కెప్టెన్ అక్షర్ పటేల్ (0) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ 4.3 ఓవర్లలో 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులో కలిసిన సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ అద్భుతమైన పోరాటపటిమ కనబరిచారు. లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా రిజ్వీ తన క్లాస్ షాట్లతో అలరించి, ఒత్తిడిలోనూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో ఢిల్లీ మరో వికెట్ నష్టపోకుండా 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.





## పాపం పంత్

ఐపీఎల్ 2026 సీజన్ టోర్నీని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్(7) పేలవంగా ప్రారంభించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో రిషభ్ పంత్ దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రిషభ్ పంత్.. ఓ బౌండరీతో జోరు కనబర్చాడు. కానీ మిచెల్ మార్ష్ కొట్టిన ఓ షాట్ అతని రనౌట్‌కు దారి తీసింది. బంతి బౌలర్ చేతికి తాకి నాన్ స్ట్రైకర్ వికెట్లను తాకింది. అప్పటికే రిషభ్ పంత్ క్రీజు ధాటి ఉండటంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. ముఖేష్ కుమార్ వేసిన మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఆఖరి బంతిని మార్ష్ బౌలర్‌వైపు ఆడగా.. అతని చేతి వేలిని తాకుతూ స్టంప్స్‌ను పడేసింది. దాంతో రిషభ్ పంత్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. తన బ్యాడ్‌టైమ్‌ను నిందించుకుంటూ పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం ఈ రనౌట్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. పంత్‌పై నెటిజన్లు సానుభూతి చూపిస్తున్నారు. 'పాపం పంత్.. పగోడికి కూడా రావొద్దు ఈ కష్టం'అని కామెంట్ చేస్తున్నారు.

## ఐపీఎల్ ఆడటం చాలా కష్టం: ముజరాబాని

అంతర్జాతీయ క్రికెట్ కంటే ఐపీఎల్ ఆడటం చాలా కష్టమైనదని కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) పేసర్, జింబాబ్వే




స్టార్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరాబాని అన్నాడు. గతంలో ఆర్‌సీబీ జట్టులో ఉన్నప్పుడు ఐపీఎల్ గేమ్స్ ఎలా సాగుతుందో స్వయంగా చూశానని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్లెస్సింగ్ ముజరాబాని తొలి మ్యాచ్‌లో అంచనాలను అందుకోలేకపోయాడు. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో అతన్ని కేకేఆర్ తీసుకుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వే తరఫున 13 వికెట్లు పడగొట్టాడు. కానీ ముంబై ఇండియన్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 3 ఓవర్లు వేసిన ముజరాబాని 34 పరుగులిచ్చి ఒక్క వికెట్ తీయలేదు. తాజాగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడిన ముజరాబాని.. ఐపీఎల్ అత్యంత కఠినమైన టోర్నీ అని అభిప్రాయపడ్డాడు. ' ఈ సీజన్‌లో నేను మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నా. ఈ టోర్నీ ఆడటం నాకు చాలా ఇష్టం. ఈ టోర్నీ ఆడే సామర్థ్యం నాకు ఉంది. గతంలో ఆర్‌సీబీ జట్టులో భాగంగా ఉన్న నేను ఈ టోర్నీని నిశితంగా గనమించాను. అంతర్జాతీయ క్రికెట్ కంటే ఐపీఎల్ కష్టతరమైనది. గతేడాది ఆర్‌సీబీలో ఉన్నప్పుడు ఆట ఎలా సాగుతుందో నేను స్వయంగా చూశాను. ఈ ఏడాది.. నేను ఆ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకుంటున్నా. మా కోచ్ డ్వేన్ బ్రావో ఇప్పటికే నాకు చాలా విషయాలు చెప్పాడు. నేను ఆడటం ప్రారంభించినప్పటి నుంచి, నా బౌలింగ్ గురించి, నాకు ఉండవలసిన నైపుణ్యాల గురించి, ముఖ్యంగా టీ20ల్లో ఎలా ప్రాక్టీస్ చేయాలి, టీ20 క్రికెట్‌ను ఎలా చూడాలి అనే విషయాలపై చాలా సమాచారం ఇచ్చారు. ఈ సీజన్ ముగిసే సమయానికి, నేను ఒక భిన్నమైన బౌలర్‌గా మారుతానని నమ్ముతున్నాను. భారత ఆటగాళ్లు చాలా కష్టపడతారు. నేను కూడా కష్టపడే స్వభావం కలవాడినే. కానీ వీరు కష్టపడే విధానం, విజయం కోసం వారు చూపే ఆరాటం నాకు సవాలుగా అనిపిస్తోంది. వారు నన్ను మరింత ముందుకు నడిపిస్తున్నారు'అని ముజరబానీ పేర్కొన్నారు.

## క్రికెట్‌లో కివీస్ నయా రికార్డు

మహిళా వన్డే క్రికెట్ చరిత్రలో బుధవాపం ఓ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ సంచలనం సృష్టించింది. మహిళల




వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత భారీ లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. వెల్లింగ్టన్‌లోని ప్రసిద్ధ బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించింది. ఈ పోరులో న్యూజిలాండ్ మహిళల జట్టు ఏకంగా 347 పరుగుల భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించి.. వన్డే చరిత్రలోనే అత్యధిక రన్ ఛేజ్ చేసిన జట్టుగా ప్రపంచ రికార్డును నెలకొల్పింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు రెండు వికెట్ల తేడాతో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్ సాధించిన ఈ అద్భుత విజయంతో భారత మహిళల జట్టు పేరిట ఉన్న గత రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. గతేడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి అప్పట్లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా నిర్దేశించిన 347 పరుగుల కొండంత లక్ష్యాన్ని కివీస్ ఛేదించడంతో భారత్ రెండో స్థానానికి పడిపోయింది. ఉమెన్స్ క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యం పెరుగుతుందనడానికి న్యూజిలాండ్ సాధించిన ఈ విజయమే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## భారత్-జింబాబ్వే మధ్య 2 సిరీస్‌లు..

టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది. ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. "భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది" అని వివరించారు. ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం.

ఈవార్తలు

# ప్రజావాణి

www.evarthalu.com

నేటి ఈవార్తలు

గురువారం 2-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# ట్రంప్‌కు ఐరోపా షాక్

అగ్రరాజ్యం అమెరికా తలపెట్టిన యుద్ధానికి అడుగులో అడుగేసే ఐరోపా దేశాలు.. ఇప్పుడు అనూహ్యంగా గొంతు మార్చాయి. ఇరాన్‌తో యుద్ధం విషయంలో డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు వైఖరిని బాహాటంగానే వ్యతిరేకిస్తూ, 'ఇది మా యుద్ధం కాదు' అని తేల్చి చెప్పడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక పెను మార్పుకు సంకేతం. స్పెయిన్, ఇటలీ, అమెరికాకు అత్యంత నమ్మకమైన మిత్రదేశంగా భావించే బ్రిటన్ కూడా తాజాగా చేతులు ఎత్తేయడం ట్రంప్ వ్యూహాలకు గట్టి దెబ్బ తగిలినట్లయింది. సాధారణంగా నాటో ఒప్పందం ప్రకారం అమెరికా ఎక్కడ యుద్ధం మొదలుపెట్టినా ఐరోపా దేశాలు మద్దతు ఇస్తుంటాయి. కానీ, ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ పోరులో తమ భాగస్వామ్యం ఉండదని స్పష్టం చేయడం గమనార్హం. తమ జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతను పణంగా పెట్టి మరో సుదీర్ఘ యుద్ధంలోకి దిగడానికి యూరప్ సిద్ధంగా లేదని ఈ నిర్ణయాలు చాటిచెబుతున్నాయి. అటు స్పెయిన్, ఇటలీ తమ భూభాగాలను, గగనతలాన్ని అమెరికా దాడుల కోసం వాడుకోవడానికి నిరాకరించడం ట్రంప్‌ను మరింత ఇరకాటంలో పడేశాయి. అమెరికా ఫస్ట్ నినాదంతో ముందుకు వెళ్తున్న ట్రంప్, మిత్రదేశాలను కేవలం సైనిక అవసరాల కోసం వాడుకోవాలని చూడటం ఐరోపా దేశాల్లో అసహనానికి దారితీసింది. మిత్రదేశాల సహకారం లేకుండా ఇరాన్ వంటి పటిష్టమైన దేశాన్ని ఎదుర్కోవడం అమెరికాకు క్లిష్టమైన సవాలే. ఐరోపా సహాయం నిరాకరించడంతో, ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసహనం వ్యక్తం చేయడం ఆయన అసహాయతను ప్రతిబింబిస్తోంది. చమురు సంక్షోభం ఎదురైతే మీరే చూసుకోండి అని ఆయన హెచ్చరించినా, ఐరోపా దేశాలు మాత్రం శాంతి చర్చలకే మొగ్గు చూపుతున్నాయి. ఏకపక్ష నిర్ణయాలతో ప్రపంచాన్ని యుద్ధ మేఘాల కిందకు నెట్టడం సాధ్యం కాదని ఐరోపా దేశాల ఐక్యత నిరూపిస్తోంది. యుద్ధం వల్ల కలిగే ఆర్థిక నష్టాలు, శరణార్థుల సమస్యలు ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో చవిచూసిన యూరప్.. ఇప్పుడు మరో అనవసర పోరులో బలికావడానికి సిద్ధంగా లేదు. ట్రంప్ తన దూకుడును తగ్గించుకుని, దౌత్యపరమైన మార్గాలను అన్వేషించక తప్పని పరిస్థితిని ఈ దేశాలు కల్పించాయి. ఇది కేవలం ఇరాన్ విజయం కాదు, ఐరోపా దేశాల విజ్ఞతకు నిదర్శనం.




# బ్యాంకుల తిన్నింటి వాసాలు!

నేడు సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టడంలో బ్యాంకులు ముందంజలో ఉన్నాయి. ఒకప్పుడు బ్యాంకింగ్ అంటే పొదుపునకు భరోసా, అవసరానికి ఆసరా. కానీ నేడు ఖాతాలో డబ్బులు దాచుకోవాలన్నా, తీయాలన్నా, కనీసం మన ఖాతాలో ఎంత సొమ్ము ఉందో తెలుసుకోవాలన్నా ఏదో ఒక రూపంలో చార్జీలు చెల్లించాల్సి రావడం గమనార్హం. ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకులు సామాన్యుడిని పిండేస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. గత మూడేళ్లలో ప్రైవేట్ బ్యాంకులు కేవలం 'మినిమమ్ బ్యాలెన్స్' లేదన్న నెపంతో ఖాతాదారుల నుంచి సుమారు ▯11,000 కోట్లను వసూలు చేశాయి. ఖాతాలో సొమ్ము తక్కువగా ఉందంటే అది ఆ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని అర్థం. కానీ బ్యాంకులు ఆ స్థితిని ఆసరాగా చేసుకుని భారీ జరిమానాలు విధిస్తున్నాయి. ఉచిత పరిమితి దాటితే చార్జీలు. పైగా ఆర్‌బీఐ మే 2025 నుండి ఏటీఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజును కూడా పెంచింది. నిధుల లేమి వల్ల చెక్కు బౌన్స్ అయితే విధించే జరిమానాలు సామాన్యుడికి మోయలేని భారంగా మారుతున్నాయి. ఎస్ఎంఎస్ అలర్ట్స్, డెబిట్ కార్డ్ వార్షిక రుసుములే కాకుండా, ఏటీఎంలలో నగదు లేక లావాదేవీ విఫలమైనా కొన్ని బ్యాంకులు పెనాల్టీలు వేస్తున్నాయి. లోన్ తీసుకునేటప్పుడు ప్రాసెసింగ్ ఫీజులు, డాక్యుమెంటేషన్ చార్జీలతో మొదలై.. లోన్ ముందస్తుగా క్లోజ్ చేయాలన్నా పెనాల్టీలు వసూలు చేస్తున్నాయి.అయితే, ఆర్‌బీఐ ఇటీవల అన్ సెక్యూర్డ్ రుణాల విషయంలో, లోన్ క్లోజర్ ఫీజులపై కఠిన నిబంధనలు తెచ్చినా, క్షేత్రస్థాయిలో బ్యాంకులు ఏదో ఒక పేరుతో వసూళ్లను కొనసాగిస్తూనే ఉన్నాయి.సర్వీస్ చార్జీలు అనేవి ఆ సేవను అందించడానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఉండాలని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నా, ప్రైవేట్ బ్యాంకులు వీటిని ఆదాయ వనరుగా మార్చుకున్నాయి. నివేదికల ప్రకారం, కొన్ని బ్యాంకులు నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆర్‌బీఐ భారీ జరిమానాలు కూడా విధిస్తోంది (ఉదాహరణకు 2025 ఆగస్టులో ఐసీఐసీఐ బ్యాంకుకు రూ.75 లక్షల ఫైన్). బ్యాంకులు కేవలం కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే కాకుండా, సామాన్యుడి సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ప్రైవేట్ బాటలో పయనిస్తూ జరిమానాల వేటలో పోటీ పడటం దురదృష్టకరం. రిజర్వ్ బ్యాంక్ కేవలం సూచనలు ఇవ్వడమే కాకుండా, సామాన్యుడిని పిండేస్తున్న ఈ చార్జీలపై కఠినమైన నియంత్రణ సాధించాలి. అప్పుడే బ్యాంకింగ్ వ్యవస్థపై సామాన్యుడికి నమ్మకం కలుగుతుంది.



**శశిధర్ అక్కెల**


# ప్రజా గొంతుక..? వినిపించేదెవరు?

దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన నక్సల్స్ వరుసగా లొంగిపోతుండటం ఒక చారిత్రక పరిణామం. రాజ్యహింసకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సరైనదా? కాదా? అన్న చర్చ పక్కన పెడితే, వ్యవస్థలోని అన్యాయంపై ఒక బలమైన 'ప్రశ్న' క్రమంగా కనుమరుగవుతోందన్నది కాదనలేని సత్యం. తుపాకీ గొట్టం నిశ్శబ్దమవుతున్న వేళ.. పాలకుల ఆధిపత్య ధోరణిని నిలదీసే ధైర్యం ఎవరికి ఉంది? నేడు పోరాటం అంటే సోషల్ మీడియాలో ఒక పోస్ట్ వేసి చేతులు దులుపుకోవడం. కీబోర్డ్ వీరుల యుగంలో క్షేత్రస్థాయి పోరాటాలు అటకెక్కుతున్నాయి.

డిజిటల్ నిరసనలు ట్రెండ్ అవుతున్నాయే తప్ప, పాలకుల వెన్నులో వణుకు పుట్టించలేకపోతున్నాయి. అడవి నుంచి నగరానికి చేరిన పోరాటం, కేవలం సెల్‌ఫోన్ స్క్రీన్లకే పరిమితం కావడం విషాదం. సోషల్ మీడియా పోస్టులతో సరిపుచ్చుతున్న ఈ రోజుల్లో, సామాన్యుడి కష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అసలైన వారెవరు? ఈ క్లిష్ట సమయంలో పౌర హక్కుల సంఘాల పాత్ర అత్యంత కీలకం. కానీ, నేడు ఆ సంఘాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఒకప్పుడు పాలకుల గుండెల్లో నిద్రపోయిన ఈ సంఘాలు, ఇప్పుడు నిస్తేజంగా మారిపోయాయి. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, హక్కుల రక్షకులుగా చెప్పుకునే కొందరు నేతలు 'కుక్కకు బొక్క వేసిన చందంగా' పాలకుల ఇచ్చే పదవులకో, తాయిలాలకో ఆశపడి మౌనం వహిస్తున్నారు. ప్రజల తరపున గొంతు విప్పాల్సిన వారు, అధికార పీఠాల నీడలో సేదతీరుతూ పాలకుల ఆధిపత్య ధోరణికి పరోక్షంగా సహకరిస్తున్నారు. వారి గొంతులో పదును తగ్గింది, ఆశయాల్లో చిత్తశుద్ధి కరువైంది. ఒకవైపు కార్పొరేట్ శక్తుల విస్తరణ, మరోవైపు హక్కుల హరణ యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలకులకు పరిపాటిగా మారింది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడమే కాదు, తప్పును ఎత్తిచూపడం కూడా. కానీ, ఇప్పుడు ఆ ఎత్తిచూపే వేళ్లు స్వార్థంతో ముడుచుకుపోతున్నాయి. పాలకుల ఆధిపత్య ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన పౌర సమాజం, మేధావులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం సమాజానికి గొడ్డలిపెట్టు. నక్సలిజం ప్రాసంగికత తగ్గి ఉండవచ్చు, కానీ వారు లేవనెత్తిన భూమి, భుక్తి, విముక్తి సమస్యలు నేటికీ సజీవంగానే ఉన్నాయి. అడవిలో తుపాకీ మోత ఆగిపోవచ్చు.. కానీ సమాజంలో అన్యాయంపై గళమెత్తే బాధ్యత ఎవరిది? ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పక్షాలు తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తుంటే, పౌర హక్కుల నేతలు తమ అస్తిత్వాన్ని పదవుల కోసం తాకట్టు పెడుతుంటే సామాన్యుడికి దిక్కెవరు? వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేవలం క్లిక్‌లు, లైక్‌లు సరిపోవు; స్వార్థం వీడి ప్రజాక్షేత్రంలో నిలిచి అడిగే నిజాయితీ గల ధైర్యం కావాలి.



**వెంకటేశ్ గుగ్గిళ్ల**
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.